క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం పాలేటి గంగ సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయంలో గత రెండు రోజులుగా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం గంగమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గురుకులలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గిరిజన బాలికా విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రజని తెలిపారు. మూడో తరగతిలో 40 సీట్లు, నాల్గవ తరగతిలో 36 సీట్లు, 5వ తరగతిలో 23 సీట్లు, ఆరో తరగతిలో 28 సీట్లు, ఏడవ తరగతిలో 16 సీట్లు, 8వ తరగతిలో 24 సీట్లు, 9వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిని లాటరీ పద్ధతిలో భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 6303145785 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మేట్ల వ్యవస్థను కొనసాగించాలి

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిలోని శ్రమ శక్తి సంఘాల మేట్ల వ్యవస్థను కొనసాగించాలని జిల్లా వ్యవసాయ శాఖ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ముప్పాళ్లపాడులో ఉపాధి కూలీలు పనిచేస్తున్న పనుల ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రమశక్తి సంఘాల ఉపాధి మేట్లను తొలగించడంతో కూలీల మస్టర్లు సమయానికి తీయలేక పోతున్నారన్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కందుకూరు సెబ్ అధికారులు మండలంలోని పూరేటిపల్లి–కళవళ్ల గ్రామాల మధ్య శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పూరేటిపల్లికి సమీపంలో ఉన్న మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న సెబ్ ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడులు చేసి కళవళ్ల అడ్డరోడ్డు రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రెండు ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాలకొండ ఆదాయం రూ.18,85,865

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి ఎలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.1885,865 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.32,320, తలనీలాలు రూ.1,06,185, ప్రత్యేక దర్శనం రూ.6,32,200, లడ్డుప్రసాదాలు రూ.2,55,590, అన్నదానం రూ.7,29,354, రూమ్‌అద్దెలు రూ.23,650 వచ్చినట్లు తెలిపారు.

జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్జి



జైలు అధికారితో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: స్థానిక సబ్ జైలును గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరి సారాదానమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల వివరాలను సూపరింటెండెంట్ లింగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలతో మాట్లాడుతూ క్షణికావేశంలో మీరు చేసిన తప్పులతో జైలు శిక్ష అనుభవిస్తు మీ కుటుంబ సభ్యులను కూడా ఇబ్బందులకు గురిచేశారన్నారు. శిక్ష పూర్తి అయిన తర్వాత ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మీకు వస్తున్న సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచే స్టోర్ రూమ్, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..!



సాగుకు సిద్ధం చేసిన భూమి



దుక్కుల్లో రైతన్న

- 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు
- 4,400 టన్నుల ఎరువులు సిద్ధం

కనిగిరి రూరల్: ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. తుఫాన్ ప్రభావంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు అక్కడక్కడ కురుస్తుండటంలో, అన్నదాతలు భూములు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఏటా కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఆరు మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగవుతాయి. వీటిలో ప్రధానంగా కంది, సజ్జ, వరి పైర్లు ఎక్కువగా సాగు చేస్తారు. ఈ మేరకు ఆరు మండలాల్లోని 96 ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు) ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. రైతులు అడిగిన వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, పిల్లి పెసర, జనుము అంద చేస్తామని ఏడీఏ తెలిపారు. ఖరీఫ్‌కు ముందుగా భూమిలో పచ్చిరొట్ట పంటలను సాగు చేసి, పూత వచ్చిన తర్వాత సాగు భూమిలోకి దున్నుతారు. దీంతో పంటలు సాగు చేసే భూములు మరింత సారవంతమవుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ మేరకు జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలను 50 శాతం సబ్సిడీపై మొత్తం 222 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. అలాగే 4,400 టన్నులు యూరియా, డీఏపీ, 20: 20: 013, పోటాష్, సింగిల్ సూపర్ పాస్పేట్, 14: 35:14 ఎరువులు అలాట్ మెంట్‌లో ఉన్నాయని, అడిగిన వెంటనే ఆర్బీకేలకు సరఫరా చేసి, రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు.

మండలాల వారీగా మంజూరైన పచ్చిరొట్ట విత్తనాల వివరాలు (క్వింటాళ్లలో)

మండలం	జీలుగ	పిల్లిపెసర	జనుము
కనిగిరి	23	5	61
పామూరు	9	9	26
వెలిగండ్ల	6	3	11
హెచ్‌ఎంపాడు	11	1	10
సీఎస్‌పురం	3	0	7
పీసీపల్లి	6	12	19

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధ మవుతున్నారు. ఖరీఫ్ సాగుకు ముందస్తుగా రైతులు భూమి సారవంతం వేసే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి ఉన్నాయి. జీలుగ 58 క్వింటాళ్లు, జనుము 134 క్వింటాళ్లు, పిల్లిపెసర 30 క్వింటాళ్లు మంజూరై ఉన్నాయి. అలాగే 4,400 టన్నులు ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తాం.



– వెంకట రమణ, ఏడీఏ, కనిగిరి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ పాండు రంగారావు,సిబ్బంది



చాకిరాలలో కార్డన్ సెర్చ్‌లో సీఐ, ఎస్సైలు

కొండపి(సింగరాయకొండ): గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కొండపి సీఐ వై.పాండురంగారావు హెచ్చరించారు. మండలంలోని కొండపి, దాసిరెడ్డి పాలెం, ముక్కోడిపాలెంలలో సీఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్‌లో భాగంగా గృహాల్లో తనిఖీల్లో చేపట్టారు. ఇళ్లలో ఎవరైనా కొత్త వ్యక్తులు నివసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సరైన పత్రాలు 20 వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ పాండురంగారావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. యువత భవిష్యత్‌ను పాడు చేసుకోకుండా గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్సై కృష్ణబాజీ, పొన్నలూరు ఎస్సై రాజేష్, మర్రిపూడి ఎస్సై శివబసవరాజు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ పాండు రంగారావు

చాకిరాలలో కార్డన్ సెర్చ్

కనిగిరి రూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ దాసరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డీఎస్పీ రత్నాకర రామరాజు ఆధ్వర్యంలో మండలంలోని చాకిరాలలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నివాస గృహాల్లో తనిఖీలు నిర్వహించి అనుమానితులను ప్రశ్నించారు. సరైన పత్రాలు లేని మోటార్ సైకిల్ వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో అలజడులు సృష్టించినా, అసాంఘిక, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కనిగిరి, హెచ్‌ఎంపాడు, పీసీపల్లి ఎస్సైలు టి.త్యాగరాజు, శివ నాగరాజు, రమేష్‌బాబు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామస్వామి తిరునాళ్ల ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



వసంతం బిందెలతో భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేటలో కోదండరామస్వామి తిరునాళ్ల రుత్వికుల వేదమంత్రాల నడుమ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా అర్చకులు పంచాగ్నుల రామమూర్తిశర్మ ఉదయం ఆలయ ప్రాంగణం వద్ద గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, స్వపనతిరుమంజసేవ, అంకురార్పణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళ మేళతాళాలు, భజంత్రీల నడుమ పుట్టబంగారాన్ని వేడుకగా తీసుకువచ్చారు. అనంతరం సామూహిక కుంకుమపూజ, స్వామికి వసంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

ఆదివారం స్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీ చెన్నకేశవునికి కళ్యాణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీ.కేశవరావు, ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామివారు

పొగాకు అత్యధిక ధర రూ. 321



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 321 పలికింది. కాకుటూరివారిపాలెం, తూర్పునాయుడుపాలెం గ్రామాలకి చెందిన రైతులు 1163 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1038 కొనుగోలు చేయగా, 125 బేళ్ల తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ. 321 కనిష్ఠ ధర రూ. 205 పలకగా, సరాసరి రూ. 245. 14 నమోదైంది. వేలంలో 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహనాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

కనిగిరి రూరల్: ఇంటి నుంచి బయటకు వచ్చిన వేమవరపు యేసు కన్పించడం లేదని అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై త్యాగరాజు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని జమ్మలమడకకు చెందిన వి.యేసు నిత్యవసరసరుకులు తెచ్చేందుకు ఈనెల19 ఇంటి నుంచి కనిగిరి పట్టణానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుమారుడు కృపారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట శిబిరంపై దాడులు

కొమరోలు: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని అల్లినగరం గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లుగా ఎస్సై తెలిపారు.

వెలుగొండలో భక్తుల సందడి

- దాతల సహకారంతో భక్తులకు అన్నదానం

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు రావటంతో సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రతి శనివారం శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అన్నదాన సత్రం కమిటీ సభ్యులు జగన్, రత్నంశెట్టి, జవ్వాజి లక్ష్మీనారాయణ అన్నారు.



అలంకరణలో శ్రీవారు



శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి



డీఈఈ హరిబాబుకు వినతీ పత్రం అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈఈ హరిబాబు, విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందచేశారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అనేక వార్డుల్లో లో ఓల్టేజీ సమస్య వెంటాడుతుందన్నారు. ఏడో వార్డులోని కొత్తూరు చింతంగుంట్ల వారి వీధిలో, రెండో వార్డులోని బీసీ కాలనీలో, 11వ వార్డులోని కాశిరెడ్డి కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డీఈఈ హరిబాబు తక్షణం పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏడీఈ ఉమాకాంత్, విద్యుత్ అధికారులు ఉన్నారు.

ముగిసిన గంధ మహోత్సవం



దర్గాలో పూజలు చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మండలంలోని నందనమారెళ్ల వద్ద ఉన్న నాగూర్ మీరా స్వామి (ఖాదర్ వలి) దర్గా గంధ మహోత్సవం శనివారం ప్రత్యేక పూజలతో ముగిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ దర్గా వద్ద శుక్రవారం రాత్రి విశిష్ట పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు ఉన్నవారు స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, బీసీ సంఘ నాయకులు ద్రోణాదుల చెంచులు, బారాయిమామ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ 11వ వార్షికోత్సవం



గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కొండపి(సింగరాయకొండ): కొండపి పంచాయతీలోని కట్టవారిపాలెంలో శనివారం పోలేరమ్మతల్లి 11వ వార్షిక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పునర్ నిర్మించి 11 ఏళ్ల నిండి 12వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వినాయక, నాంచారమ్మ దేవత సమేత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మందుగా గ్రామస్తులు అమ్మవారికి సద్ది, పసుపు నీరు తీసుకొని ఊరేగింపుగా గుడి వద్దకు తీసుకొని వచ్చి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఉలవపాడు గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

ఉలవపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు క్యారమ్స్, చెస్, మ్యూజికల్ ఛైర్స్ ఆటలను ఆడించారు. గత 10 రోజులుగా విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు చదివించారు. విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదివించారు. మొత్తం 42 మంది విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. 10 రోజులగా నిర్వహించిన పోటీల్లో 150 మంది విజేతలకు ఆదివారం బహుమతులు అందచేయనున్నారు. స్థానిక గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

జీవ ఎరువులు విరివిగా ఉపయోగించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అబ్రహంలింకన్

లింగసముద్రం: జీవ సంబంధమైన ఎరువులను వాడటం ద్వారా భూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని వ్యవసాయాధికారి టి.అబ్రహంలింకన్ అన్నారు. లింగసముద్రం-1, ఎర్రారెడ్డిపాలెం రైతుభరోసా కేంద్రాల్లో శనివారం భూసార పరిరక్షణపై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు పొలంలో దున్నడం ద్వారా పైర్లకు అవసరమైన సేంద్రియ పదార్థాలు అందుతాయని తెలిపారు. మట్టి నమూనా పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులను ఉపయోగించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు పంటలకు ఉపయోగించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు సుధీర్, మనుకిరణ్, రైతులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఆర్‌ఓ కిరణ్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏ కుమార్ మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీ రైజ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఏ విధంగా అనుసరించాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఏఆర్‌ఓ కిరణ్‌కుమార్, ఏజెంట్లు పాల్గొన్నారు.